క్లుప్తంగా

మిగులు సీట్లకు దరఖాస్తు చేసుకోండి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కనమనంబేడు గ్రామంలోని ఏకలవ్య మోడ్రన్ ఎస్టీ గురుకుల పాఠశాలలో మిగులు సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ ధర్మేంద్రకుమార్‌సింగ్ తెలిపారు. బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీలో భాగంగా ఏడు, ఎనిమిది, తొమ్మిది, ఇంటర్ ఫస్ట్ ఇయర్ సంవత్సరంలో బాలురు, బాలికలకు మిగులు సీట్లు ఉన్నాయన్నారు. ఈ సీట్ల భర్తీ కోసం ఈ నెల 11వ తేదీన పాఠశాలలోనే పరీక్ష నిర్వహించి ఎంపిక చేస్తామని, అర్హత ఉన్న విద్యార్థులు పాఠశాల్లో సంప్రదించాలని తెలిపారు.

గిరిజన గురుకుల స్కూల్‌లో దరఖాస్తులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలలో ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సురేష్‌కుమార్ కోరారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. 3వ తరగతిలో 40 ఖాళీలకు గానూ 32 ఎస్టీ, 5 ఎస్సీ, 2 బీసీ, 1 ఓసీ, 4వ తరగతిలో ఎస్టీ 40, 5వ తరగతిలో 30 ఎస్టీ, 6వ తరగతిలో 28 ఎస్టీ, 7వ తరగతిలో 6 ఎస్టీ, 8వ తరగతిలో 9 ఎస్టీ, 9వ తరగతిలో 1 ఎస్టీ సీటుకు ఈ నెల 20వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9652308420 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

చలువ పందిళ్ల ఏర్పాటు



వేద నారాయణస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

నాగలాపురం: మండలంలోని ప్రసిద్ధి గాంచిన టీటీడీ అనుబంధంగా ఉన్న శ్రీ వేదవల్లి సమేత శ్రీ వేదనారాయణ స్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం నిమిత్తం చలువ పందిళ్లు, ఫ్లోరింగ్ మ్యాట్‌లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారి చెంగల్‌రాయులు మాట్లాడుతూ అటు ఆంధ్ర, ఇటు తమిళనాడు నుంచి స్వామి దర్శనార్థం భక్తులు భారీ సంఖ్యలో వస్తుంటారు. వేసవి తాపాన్ని దృష్టిలో పెట్టుకుని భక్తులకు ఇబ్బంది రాకుండా చలువ పందిళ్లు, ఫ్లోరింగ్ మ్యాట్లు, చల్లటి ఫిల్టర్ నీళ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



మృతదేహం

శ్రీకాళహస్తి: పట్టణంలోని స్వర్ణముఖి నది వంతెన వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. 1వ పట్టణ సీఐ గోపి తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాళహస్తీశ్వరాలయం సమీపంలోని స్వర్ణముఖి నది కొత్త వంతెన వద్ద నీటిలో ఓ గురు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకున్నారు. మృతుడి ఆనవాళ్ల కోసం ప్రయత్నించారు. లభ్యం కాకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేసి శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఎవరైనా గుర్తిస్తే 1వ పట్టణ పోలీసులను సంప్రదించాలని కోరారు.

ఉపాధి పనులు చేస్తూ కూలీ మృతి



కేశవులు (ఫైల్)

వరదయ్యపాళెం: వేసవి తాకిడికి ఉపాధి పనులు చేస్తున్న ఓ కూలీ మృతిచెందాడు. ఈఘటన మండలంలోని చిలమత్తూరు గ్రామంలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల వివరాలు మేరకు.. చిలమత్తూరుకు చెందిన కేశవులు (65). ఇతను రోజూవారి ఉపాధి హామీ పనులకు వెళతాడు. ఈక్రమంలో శనివారం ఆయన యథావిధిగా ఉపాధి పనులకు వెళ్లాడు. చెరువు వద్ద పనులు చేస్తుండగా కేశవులు ఒక్కసారిగా కుప్పకూలాడు. వెంటనే ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందాడు. కుటుంబసభ్యులు ఏపీఓకు సమాచారం ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శి పద్మనాభరాజు, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ శ్యామ్‌ప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్ మోహన్‌దాస్ సంఘటన స్థలానికి వెళ్లి ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు.

వేదిక్ వర్సిటీలో వేసవి శిబిరం

తిరుపతి సిటీ: ఎస్వీ వేద విశ్వవిద్యాలయంలో వైదిక, యోగా కోర్సులకు సంబంధించి శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేకంగా వేసవి శిబిరం ప్రారంభించనున్నట్లు వర్సిటీ అధికారులు శనివారం తెలిపారు. ఈనెల 7వ తేదీన ప్రారంభించి జూన్ 5 వరకు తిరుపతి వాసులకు శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఆహ్నిక ప్రకరణంలో సంధ్యావందనం, సమిదాదానం, బ్రహ్మ యజ్ఞం, సంపూర్ణ భగవద్గీత, సంస్కృత భాషపై పూర్తి స్థాయి శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అలాగే మహాలక్ష్మీ పూజ, విష్ణు, శివ పూజా విధానం, వినాయక వ్రతం, మంగళ గౌరీ వ్రతం, వరలక్ష్మీ వ్రతం, అనంత పద్మనాభ వ్రతం, సత్యనారాయణ స్వామి వ్రతం, నిత్య కృత్యములపై శిక్షణ ఉంటుందని వివరించారు. వెంకటేశ్వర స్వామి సుప్రభాతం, ప్రపత్తి, మంగళశాసనం, విష్ణు సహస్రనామ పారాయణం, లక్ష్మీ అష్టోత్తరం, యోగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకు 99491 91999 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

హైకోర్టు ఆదేశాలను ధిక్కరిస్తారా ?

- లారీకి రూ.400 గేటు వసూలు ఎలా చేస్తారు ?
- రేణిగుంట మార్కెట్‌లో కాంట్రాక్టర్ గేటు వసూలు దందా చేస్తున్నారు
- గుత్తేదారుడికి పంచాయతీ ఈఓ ఒత్తాసు పలకడం ఏంటి ?
- న్యూ ఆంధ్రా మోటార్, ట్రక్కర్స్ అసోసియేషన్ నేతల ఆగ్రహం





పంచాయతీ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న అసోసియేషన్ నాయకులు, అధిక మొత్తంలో గేటు వసూలు చేసిన రసీదు



ఈఓకు కోర్టు ఆర్డర్ కాపీని అందిస్తున్న అసోసియేషన్ నాయకులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): హైకోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ మార్కెట్‌లో లారీల నుంచి గేటు వసూలు చేయడం అన్యాయం.. గుత్తేదారు తీరు మార్చుకోకపోతే పంచాయతీ అధికారులపై కోర్టు ధిక్కరణ కేసు వేస్తామని న్యూ ఆంధ్రా మోటార్, ట్రక్కర్స్ అసోసియేషన్ నాయకులు తేల్చి చెప్పారు. శనివారం రేణిగుంట మార్కెట్‌కు లోడుతో వచ్చే లారీల నుంచి కాంట్రాక్టర్ మనుషులు గేటు వసూలులో దౌర్జన్యానికి పాల్పడడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. సరుకు రవాణా చేసే వాహన యజమాని, డ్రైవర్ ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని, వ్యాపారం చేసే యజమాని దగ్గర గేటు వసూలు చేసుకోవాలని కోర్టు ఆర్డర్లు ఉన్నాయన్నారు. కానీ కోర్టు ఆదేశాలను కూడా లెక్క చేయకుండా కాంట్రాక్టర్ పంచాయతీ అధికారులతో కుమ్మక్కై వాహన యజమాని, డ్రైవర్లను గేటు రుసుం కోసం దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపించారు. పంచాయతీ అధికారులు ఇదేవిధంగా ఉంటే వారిపై కోర్టు ధిక్కరణ కేసు వేస్తామని హెచ్చరించారు.

లారీ తాళాలు లాక్కోవడం ఏంటి ?

రేణిగుంటలో సాగుతున్న గేటు వసూళ్ల దందాపై స్థానిక లారీ ఓనర్లు న్యూఆంధ్రా మోటార్, ట్రక్కర్స్ అసోసియేషన్ దృష్టికి తీసుకెళ్లారు. అసోసియేషన్ సభ్యులు శనివారం రేణిగుంట పంచాయతీ కార్యాలయానికి వచ్చి ఈఓ మణికి సమస్యను తెలిపారు. హైకోర్టు ఆర్డర్ కాపీని అందించారు. ఎక్కడా లేనివిధంగా వాహనానికి రూ.400 వసూళ్లు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత డబ్బులు ఎందుకు అని ప్రశ్నించిన డ్రైవర్‌పై దురుసుగా ప్రవర్తించి లారీ తాళాలను లాక్కోవడం ఏమిటని ప్రశ్నించారు. రేణిగుంటలో జరుగుతున్న వసూళ్ల దందాపై అసోసియేషన్ నాయకులు డీపీఓ సుశీలాదేవికి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయగా.. పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారన్నారు.

కాంట్రాక్టర్‌కు వత్తాసు..



కాంట్రాక్టర్ లారీల వద్ద నుంచి అధికంగా రుసుం చేస్తున్నారని ఈఓకి ఫిర్యాదు చేశాం. ఎంతసేపూ కాంట్రాక్టర్‌కు వత్తాసుగానే ఈఓ మాట్లాడడం విడ్డూరంగా అనిపించింది. కోర్టు ఆర్డర్ ఉందంటే.. నేను కొత్తగా వచ్చాను అనడం ఏమిటి ? వచ్చిన ప్రతి ఈఓ కూడా తాము కొత్తగా వచ్చామని చెబుతూ కోర్టు ఆర్డర్లను లెక్కచేయడం లేదు. ఈఓ నెల రోజులు గడువు అడిగారు. న్యాయం చేస్తారని ఆశిస్తున్నాం.

– మహారాధి, అధ్యక్షుడు, న్యూ ఆంధ్రా మోటార్, ట్రక్కర్స్ అసోసియేషన్

డ్రైవర్లపై దౌర్జన్యం చేయడం ఏమిటి ?



గేటు వసూలు చేసే వాళ్లు డ్రైవర్లపై దౌర్జన్యం చేయడం దారుణం. 2003లోనే ప్రభుత్వం జీఓ ఇచ్చింది. హైకోర్టు ఆర్డర్లు ఉన్నాయి. ఆ ప్రకారం వాహనాలు గేటు రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. వాటిని పట్టించుకోకుండా పంచాయతీ అధికారులు వ్యవహరిస్తున్నారు.

–టీవీ చలపతిరావు, జనరల్ సెక్రటరీ, న్యూఆంధ్రా మోటార్, ట్రక్కర్స్ అసోసియేషన్

హైకోర్టు ఆదేశాలు అంటే లెక్కలేదు



రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీఓ గురించి గానీ, హైకోర్టు ఆదేశాల గురించి గానీ ఈఓ తెలియదు అంటున్నారు. నిద్ర పోయే వాళ్లను లేపవచ్చు. నిద్ర పోయేటట్టు నటించే వాళ్లను లేపలేం అనేలా ఈఓ వ్యవహార శైలి ఉంది. ఇదేవిధంగా వసూలు చేస్తే పంచాయతీ ఈఓపై కోర్టు ధికరణ కేసు వేస్తాం.

–శేషగిరి, జాయింట్ సెక్రటరీ, న్యూఆంధ్రా మోటార్, ట్రక్కర్స్ అసోసియేషన్

పరిశీలించి న్యాయం చేస్తాం..



మోటర్ అసోసియేషన్ సభ్యులు లారీలకు గేటు వసూలు వర్తించదని కోర్టు ఆర్డర్స్ తెచ్చి చూపించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లాను. పరిశీలించి కాంట్రాక్టర్‌కు, లారీ వాళ్లకు నష్టం కలగకుండా చర్యలు చేపడతాం. అధిక రుసుం వసూళ్లపై ఆధారాలతో రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

–మణి, ఈఓ, రేణిగుంట పంచాయతీ

శనీశ్వరస్వామికి తైలాభిషేకం



ప్రత్యేక అలంకరణలో శనీశ్వరస్వామి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి నువ్వుల నూనె, మంచినూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామి వారిని పలు పుష్పాలతో విశేషంగా అలంకరించారు. విశేష పూజలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపీడీఓ వెంకటరత్నమ్మ

బుచ్చినాయుడుకండ్రిగ: మండల పరిషత్ అభివృద్ధిగా వెంకటరత్నమ్మ బాధ్యతలు స్వీకరించారు. నాగలాపురం మండల ఈఓపీఆర్డీగా పనిచేస్తున్న వెంకటరత్నమ్మ ఎంపీడీఓగా పదోన్నతి పొందారు. దీంతో ఆమె ఎంపీడీఓగా బుచ్చినాయుడు కండ్రిగ బదిలీపై వచ్చారు. ఇదే కార్యాలయంలో ఏఓగా పనిచేస్తూ త్రివిక్రమ్‌రావు ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా బాధ్యతలు నిర్వహించారు. మండలంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీడీఓ వెంకటరత్నమ్మ తెలిపారు.

హంస వాహనంపై అగస్తీశ్వరుడు



హంస వాహనంపై దర్శనమిస్తున్న అగస్తీశ్వరస్వామి

నారాయణవనం: మండలంలోని సముదాయం గ్రామంలో టీటీడీ అనుబంధ మరగదవల్లీ సమేత అగస్తీశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో శనివారం రాత్రి హంస వాహనంపై ఉత్సవర్లు భక్తుల నుంచి హారతులు అందుకున్నారు. ఉదయం ఆలయంలో అర్చకులు నిత్యకైంకర్యాలను పూర్తి చేశారు. 10 గంటలకు ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించి ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం పూజలను అందుకున్న ఉత్సవమూర్తులు సుందరంగా అలంకరించుకుని హంస వాహనాన్ని అధిరోహించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ సముదాయం గ్రామ వీధుల్లో విహరించారు. కార్యక్రమాలలో ఈఓ రవి, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, ఆలయ అర్చకులు రమేష్ గురుక్కల్, గౌతం గురుక్కల్ పాల్గొని పర్యవేక్షించారు. నాలుగో రోజు ఆదివారం సాయంత్రం అగస్తీశ్వరస్వామి శేష వాహనంపై ఊరేగనున్నారు.

ఉయ్యాల సేవలో కల్యాణ వెంకన్న



ఉభయ నాంచారులతో కల్యాణ వెంకన్న

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం దేవేరులకు ఉయ్యాల సేవ నిర్వహించారు. ఉదయం ఆలయంలో అర్చకులు సుప్రభాత సేవతో నిత్యకైంకర్యాలను పూర్తి చేశారు. ఉదయం నుంచి భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను అందుకున్నారు. సాయంత్రం తిరుచ్చి వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామిని అధిష్టింపజేశారు. ఊంజల్ మండపంలో ఉయ్యాలసేవలో ఉత్సవమూర్తులు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, అర్చకులు శ్రీనివాస భట్టాచార్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బస్సులు రావు.. కూర్చోడానికి బెంచీలు కరువు

- అధ్వానంగా నాగలాపురం బస్టాండ్
- మౌలిక సదుపాయాలు లేక ప్రయాణికుల ఇక్కట్లు
- ఆర్టీసీ అధికారులు దృష్టి సారించాలంటున్న స్థానికులు



మౌలిక నాగలాపురం ఆర్టీసి బస్టాండు

నాగలాపురం: మండల కేంద్రం నాగలాపురం ఆర్టీసీ బస్టాండు అధ్వాన స్థితిలో దర్శనమిస్తోంది. బస్టాండు ఆవరణలో మల, మూత్ర విసర్జణ చేయడం, రాత్రివేళల్లో మందుబాబులు మద్యం సేవించి ఖాళీ బాటిళ్లు అక్కడే పడేసి వెళ్తున్నారు. దీంతో బస్టాండు ఆవరణమంతా దుర్వాసన వెద జల్లుతోంది. ప్రయాణికులు బస్టాండులో నిల్చోడానికి ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండు చుట్టూ ఆటోలు నిండి ఉన్నాయి. ఇతర వాహనాలు పార్కింగ్‌కు ఉపయోగిస్తున్నారు. ఇటీవల పడిన భారీ వర్షాల వల్ల బస్టాండు ఆవరణలో గుంతలు ఏర్పడ్డాయి. స్థానిక సర్పంచ్ చిన్నదొరై సుధా తన సొంత డబ్బులతో గ్రావెల్ తోలి జేసీబీతో చదును చేయించారు. ప్రయాణికులు బస్సుల కోసం ఎండలోనే వేచి ఉండాల్సిన పరిస్థితి. టీపీ కోట మార్గంలో సత్యవేడు వెళ్లే బస్సులు తప్ప మిగతా బస్సులు బస్టాండు లోపలకు రావడం లేదు. బస్టాండు లోపల ప్రయాణికులు కూర్చోడానికి కుర్చీలు లేవు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా తిరుమల–చెన్నై ఎక్స్‌ప్రెస్ బస్సులు నాగలాపురం లోపలకు రావడం లేదు. దీనిపై పలుమార్లు తిరుమల డిపో మేనేజరుకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు. సంబంధిత డిపో అధికారులు దృష్టి సారించి నాగలాపురం బస్టాండు లోపలకు అన్ని బస్సులు వచ్చేలా చూడాల్సిన అవసరం ఉంది. అలాగే ప్రయాణికులు కూర్చోవడానికి కనీసం బెంచీలు అయినా ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

స్టేజీ పైకప్పు నిర్మాణానికి వితరణ

సత్యవేడు: మండలంలోని మదనంబేడు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల స్టేజీ పైకప్పు నిర్మాణానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు కలసి రూ.20 వేలు వితరణ అందించారు. స్టేజీ నిర్మాణానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆర్థికసాయం అందించారని ప్రధానోపాధ్యాయుడు చినబాబు తెలిపారు. పాఠశాలలో పలు కార్యక్రమాలు నిర్వహించాలంటే ఇబ్బందిగా ఉందన్నారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు సాయం అందించేందుకు ముందుకొచ్చారని తెలిపారు. వీరితోపాటు గ్రామసర్పంచ్ శివరంజని, వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సరోజని, రాబర్టు, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లుకు హెచ్‌ఎం కృతజ్ఞతలు తెలిపారు.

ప్రత్యేక తరగతుల పరిశీలన



ప్రత్యేక తరగతులను పరిశీలిస్తున్న ఎంఈఓ రవీంద్రనాథ్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఐదు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు రాయనున్న విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్టు ఎంఈఓ రవీంద్రనాథ్ తెలిపారు. శనివారం ఆయన పల్లమాల గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లో సప్లమెంటరీ విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా పదో తరగతి ఫెయిల్ అయి సప్లిమెంటరీ పరీక్షలు రాస్తున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటలు వరకు తరగతులు నిర్వహిస్తున్నారని, విద్యార్థులతో ఫెయిల్ అయిన సబ్జెక్టులను చదివిస్తున్నారని చెప్పారు. అలాగే సెలవు రోజుల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తరగతుల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు విద్యార్థులను దత్తత తీసుకుని చదివిస్తున్నారన్నారు. సప్లిమెంటరీలో అందరూ పాసయ్యేలా కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గాయిత్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి కార్మికుడికీ ఈ–శ్రమ్ కార్డు తప్పనిసరి



కార్మికులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయవాదులు

శ్రీకాళహస్తి: ప్రతి కార్మికుడు ఈ–శ్రమ్‌కార్డును కలిగి ఉండాలని న్యాయవాదులు అన్నారు. న్యాయ వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని రామసేతు వంతెన వద్ద కార్మికులకు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ ప్రతి కార్మికుడు హక్కులు, విధులు తెలుసుకోవాలన్నారు. అదేవిధంగా ఈ–శ్రమ్‌కార్డును ఎలా తీసుకోవాలో.. దాని వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు గుమ్మళ్ల రాజేశ్వరరావు, శ్రీకాంత్, అరుణ్, పారా లీగల్ వలంటీరు బాబా ఫరీద్ పాల్గొన్నారు.

టపాసుల గోదాముల్లో విస్తృత తనిఖీలు



టపాసుల గోదాములను తనిఖీ చేస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి: బాణసంచా దుకాణ యజమానులు వేసవి నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం తొట్టంబేడు మండల పరిధిలోని పలు టపాసుల దుకాణాలను అధికారులు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిబంధనల మేరకు అన్ని రకాల ప్రమాద నివారణ చర్యలను టపాసుల దుకాణాల యజమానులు తీసుకోవాలని హెచ్చరించారు. ముఖ్యంగా విద్యుత్ ప్రమాదాలు సంభవించకుండా చూసుకోవాలని, ఎండలో వేడికి ప్రమాదాలు జరగకుండా ప్రభుత్వ నిబంధనలకు లోబడి జాగ్రత్త వహించాలన్నారు. , నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. భద్రతకు సంబంధించి ఎప్పటికప్పుడు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని.. ఏదైనా అనుకోని ప్రమాదాలు సంబంధించినప్పుడు నష్ట నివారణకు తీసుకోవాల్సిన ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి లేబర్ ఆఫీసర్ రంగనాథ్, తొట్టంబేడు మండల డిప్యూటీ తహసీల్దార్ జగన్‌మోహన్, శ్రీకాళహస్తి ఫైర్ ఆఫీసర్ నాగార్జున రెడ్డి, 2వ పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ పార్థసారథి పాల్గొన్నారు.

స్విమ్స్‌లో 'నిరంతర వైద్యవిద్య'

తిరుపతి తుడా : స్విమ్స్ కమ్యూనిటీ మెడిసిన్, మైక్రోబయాలజీ, రుమటాలజీ విభాగాల ఆధ్వర్యంలో శనివారం పద్మావతి ఆడిటోరియంలో నిరంతర వైద్య విద్య పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించా రు. రుమాటలాజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శరత్ మాట్లాడుతూ పోస్ట్–వైరల్ ఆర్థ్రాల్జియా పరిచయం ఎటియాలజీ, క్లినికల్ ప్రజెంటేషన్‌తో విద్యార్థులకు అవగాహన కల్పించారు. మైక్రోబయాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ రామకృష్ణ, కమ్యూనిటీ మెడిసిన్ ప్రొఫెసర్ రవి శంకర్ పాల్గొన్నారు.

ఎస్వీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్‌గా రవిప్రభు

తిరుపతి తుడా : ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్‌గా రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభును నియమిస్తూ అధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత ప్రిన్సిపల్ డాక్టర్ రాధ బాధ్యతలు చేపట్టి రెండు రోజులు గడవకనే ఆమెను రుయా సూపరింటెండెంట్‌గా బదిలీ చేయడం గమనార్హం.

జూనియర్ కళాశాలలపై చర్యలకు వినతి

తిరుపతి ఎడ్యుకేషన్ : జిల్లాలోని పలు ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలలు నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నేతలు కోరారు. శనివారం ఈ మేరకు ఆర్ఐఓకు వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భగత్‌రవి మాట్లాడుతూ మే 12నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల నేపథ్యంలో రెమిడియల్ తరగతులు నిర్వహించుకోవచ్చని బోర్డు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఇదే అదునుగా వేసవి సెలవులు ఉన్నప్పటికీ కొన్ని కళాశాలలు అడ్మిషన్లు చేసుకుంటూనే తరగతులను నిర్వహిస్తున్నాయని ఆరోపించారు. ఎంసెట్ కోచింగ్ పేరుతో వేధిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్ఐఓ స్పందిస్తూ జిల్లా వ్యాప్తంగా తనిఖీలు చేపట్టి నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహించే కళాశాలలపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి తేజ, శివ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి



జెండా ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏఐవైఎఫ్ 66వ ఆవిర్భావ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఏఐవైఎఫ్ శ్రీకాళహస్తి నియోజకవర్గ కార్యదర్శి తొండు మల్లికార్జున్ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం దాదాపు 12 ఏళ్లకు పైబడి అధికారంలో ఉన్నారని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని యువతకు మాట ఇచ్చిన ఆయన గాలికి వదిలేశారని మండిపడ్డారు. అయితే తన మిత్రులైన అంబానీ, అదానీలకు దేశంలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ కార్పొరేట్ ఆస్తులన్నీ కట్టబెడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల 38 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన కూటమి నేతలు ఇప్పుడు అధికారం చేపట్టి 11 నెలలు కావొస్తున్నా వాటి ఊసే ఎత్తడం లేదన్నారు. మరోవైపు ప్రతి నిరుద్యోగికి భృతి ఇస్తామన్న హామీని గాలికి వదిలేశారన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మే 15 నుంచి 18వ తేదీ వరకు తిరుపతి మహా నగరంలో జరిగే ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ పట్టణ నాయకులు సాయి జ్యోతి, రవి, మహమ్మద్ షఫీ, అంజి, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మునిచందు తదితరులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్‌తోనే హక్కుల సాధన



వరదయ్యపాళెం: ఏఐవైఎఫ్ ఆవిర్భావ వేడుకలు నిర్వహిస్తున్న సంఘం నాయకులు

వరదయ్యపాళెం: అఖిల భారత యువజన సమాఖ్య పోరాటాలతోనే యువత హక్కుల సాధన సాధ్యమైందని ఏఐవైఎఫ్ సంఘం జిల్లా సహాయక కార్యదర్శి నాగార్జున అన్నారు. శనివారం ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వరదయ్యపాళెం బస్టాండ్ ఆవరణలో జెండా ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిశ్రమల్లో వయో పరిమితిని పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్రైవేట్ పరిశ్రమల్లో పనిచేసే ప్రతి ఉద్యోగికి ఈఎస్ఐ, పీఎఫ్ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి తరుణ్ కుమార్, విద్యార్థి యువజన నాయకుడు ప్రతాప్, నాగరాజు, సుబ్బులు పాల్గొన్నారు.